డంపింగ్‌యార్డుపై బిజెపి నేతల రాజకీయాలు: డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అమర్

ఘట్‌కేసర్, నవంబరు 4, ప్రభాతవార్త:

రసాయనవ్యర్థాలు ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణచెరువులో కలవకుండా ప్రభుత్వం ప్రత్యేక కాలువ నిర్మించి మూసీలోకి మళ్లించేలా ప్రణాళికలు సిద్ధంచేసి, అంచనాబడ్జెట్ రూపొందించిందని ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్ తెలిపారు. ఘట్‌కేసర్‌సర్కిల్ ఎదులాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు అంశంపై బిజెపి నాయకులు రాజకీయ మైలేజ్ కోసం ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. డంపింగ్‌యార్డు తరలింపు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ ఈసమస్యను సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఇటీవల నాగారంలో అఖిలపక్షసమావేశం నిర్వహించారని, డంపింగ్‌యార్డు ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారని తెలిపారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు వ్యర్థరసాయనాలు ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో కలవకుండా చర్యలుతీసుకోవాలని వజ్రేశ్‌యాదవ్ ద్వారా హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువును పరిశీలించి వెళ్లారని అమరేందర్ తెలిపారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

మాజీ ఐపిఎస్ ఇళ్లలో ఇడి సోదాలు

మొయినాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:

మాజీ ఐపిఎస్ అధికారి పి.సీతారామ ఆంజనేయులు ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఎపిపిఎస్‌సి గ్రూప్1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సోదాలునిర్వహించినట్లు తెలిసింది. దర్యాప్తులోభాగంగా గ్రూప్1 జవాబుపత్రాల మూల్యాంకన బాధ్యతలను క్యామ్‌సైన్ మీడియా సంస్థకు అప్పగించిన వ్యవహారంలో అక్రమాలుజరిగినట్లు దర్యాప్తుసంస్థలు గుర్తించాయి. ఈవ్యవహారంలో రూ.1.14కోట్లకు పైగా అక్రమ ఆర్థికలావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన నేపథ్యంలో ఇడి మనీలాండరింగ్‌నిరోధకచట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టారు. మొయినాబాద్, హైదరాబాద్‌ల్లోని పలుప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఏడుప్రాంతాల్లో ఇడి అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. పి.సీతారామాంజనేయులుకు సంబంధించిన పలు అనుమానితప్రాంతాల్లో కీలక ఆధారాలకోసం తనిఖీలుచేపట్టినట్లు సమాచారం. గ్రూప్1 మూల్యాంకన వ్యవహారంలో నిధుల లావాదేవీలు, సంబంధిత వ్యక్తుల పాత్రపై ఇడి అధికారులు ఆరాతీస్తున్నారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం..

-రెండు నెలల్లో నిర్ణయం తీసుకోకుంటే అసెంబ్లీలో నిలదీస్తాం

-బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీమంత్రి హరీశ్‌రావు

విద్యార్థుల సమస్యలపై మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఇబ్రహీంపట్నం, నవంబరు 4, ప్రభాతవార్త:

మహేశ్వరం ప్రభుత్వవైద్యకళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీమంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలపరిధిలోని మంగళ్‌పల్లి గేట్ సమీపంలోని భారత్ ఇంజినీరింగ్ కళాశాలలో అద్దెభవనంలో ఉన్న మహేశ్వరం ప్రభుత్వ వైద్యకళాశాలను జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, భువనగిరి పార్లమెంటు ఇంచార్జి మల్లేష్‌తో కలిసి సందర్శించారు. తమకు మౌలికవసతులు కల్పించి, కళాశాల భవనాన్ని ఆస్పత్రికి సమీపంలోకి మార్చాలని విద్యార్థులు మూడురోజులుగా చేస్తున్న దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల పరిస్థితి పందులకొట్టాన్ని తలపిస్తోందని విమర్శించారు. విజన్ 2047, ఫ్యూచర్ సిటీ అంటూ ప్రకటనలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇక్కడి దుస్థితి కనిపించడం లేదా అని నిలదీశారు. కళాశాలకు సంబంధించి 26 నెలలుగా నీటి బిల్లులు, 24 నెలలుగా అద్దె చెల్లించలేదని హరీశ్‌రావు ఆరోపించారు. విద్యార్థులకు కనీస రవాణా సదుపాయం కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు అధికారులకు తెలియడం లేదా? జిల్లా కలెక్టర్, వైద్యశాఖ అధికారులు ఇప్పటివరకు కళాశాలను ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు. గతంలో రాష్ట్రంలో ఐదు వైద్య కళాశాలలు, 2,850 ఎంబిబిఎస్ సీట్లు మాత్రమే ఉండగా, తమ ప్రభుత్వ హయాంలో సుమారు 10వేల సీట్లకు పెంచామని పేర్కొన్నారు. 33 జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. చివరివిడతలో మంజూరైన మహేశ్వరం కళాశాల పరిస్థితి మాత్రం మారలేదని విమర్శించారు. మహేశ్వరం వైద్య కళాశాల కోసం తమ ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయించి, సుమారు రూ.175కోట్లు మంజూరుచేసిందని హరీశ్‌రావు తెలిపారు. మూడేళ్లు కావస్తున్నా శాశ్వత భవనాల నిర్మాణంలో పురోగతిలేదని, టెండర్ల ప్రక్రియ కూడా ముందుకు సాగలేదని ఆరోపించారు. కళాశాలలో మౌలిక సదుపాయాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని హరీశ్‌రావు డిమాండ్‌చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే కళాశాలను సందర్శించి విద్యార్థులసమస్యలను తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి రాతపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హరీశ్‌రావు స్పష్టంచేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే శాసనసభ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి నిలదీస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి స్వయంగా కళాశాలను సందర్శించి విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి ఛైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డి, పల్లె గోపాల్‌గౌడ్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఛైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు జెర్కొని రాజు, పార్టీ శ్రేణులు తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి కాంస్య పతకం సాధించిన అక్షయ

DISTRICT SCHOOL GAMES, ATHLETICS CHAMPIONSHIP
UNDER 17 BOY'S & GIRL'S

కాంస్య పతకంతో విద్యార్థిని అక్షయ

కేశంపేట, నవంబరు 4, ప్రభాతవార్త:

శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోని ఎంజెపిటి రాజేంద్రనగర్ బ్రాంచ్ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో మరోసారి సత్తాచాటింది. ఆ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం.అక్షయ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ మూడుకిలోమీటర్ల పరుగుపందెం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ప్రథమస్థానాన్ని సాధించి బంగారుపతకాన్ని సొంతంచేసుకుంది. అంతేకాక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. బుధవారం ఖమ్మంజిల్లాలో నిర్వహించిన మూడుకిలోమీటర్ల పరుగుపందెంలో కాంస్యపతకం (బ్రాంజ్‌మెడల్) సాధించింది. రాష్ట్రంలోని ఆయాజిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులైన ప్రతిభావంతులతో పోటీపడి మూడవస్థానంలో నిలిచి పతకం కైవసం చేసుకుంది. ఈవిజయం పాఠశాలకే కాకుండా కేశంపేట మండలం కాకునూరు గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. పాఠశాల ప్రిన్సిపల్ జి.అనిత, పిడిలు జి.స్వప్న, బి.శ్రావ్య, ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థినులు, గ్రామస్తులు అక్షయను అభినందించారు.

సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం..

-దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం!

-మీ సేవలో దరఖాస్తుచేసుకొని నెలలుగడుస్తున్నా అందని ధ్రువీకరణ పత్రాలు

దౌల్తాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:

వికారాబాద్‌జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ తీవ్ర జాప్యానికి గురవుతోందని విద్యార్థులు, ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వివిధ అవసరాలనిమిత్తం కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ తదితర ధ్రువీకరణపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ నెలలుగడుస్తున్నా, సర్టిఫికెట్లు చేతికి అందడంలేదని వాపోతున్నారు. దీనికి నిదర్శనంగా దౌల్తాబాద్ మండలానికి చెందిన ఓ దరఖాస్తుదారు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం 27-05-2026న మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకొని, సంబంధిత రసీదును, పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించినప్పటికీ నేటికి 5నెలలు గడిచినా అధికారులు సర్టిఫికెట్ జారీ చేయలేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని ఈర్లపల్లిగ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన తల్లి మరణించగా ఆ భూమిని తన పేరుపై చేసుకోవడానికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు 05-09-2026న అనగా 2 నెలల క్రితం అప్లై చేసుకోగా కార్యాలయంచుట్టూ ఎన్నిసార్లు తిరిగినా, ఇంతవరకు ఫ్యామిలీమెంబర్ సర్టిఫికెట్ ఇవ్వలేదని, దరఖాస్తు సమయంలో రుసుముచెల్లించి, అవసరమైన పత్రాలు అందించినప్పటికీ ఇంతకాలం వేచిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతచదువులు, స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ పథకాల దరఖాస్తుల కోసం సర్టిఫికెట్లు అవసరమైన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడువులోగా ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. మరోవైపు భూముల సర్వే పనుల పేరుతో సర్టిఫికెట్ల జారీని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్ననాటి నుండి కార్యాలయంచుట్టూ పలుమార్లు తిరుగుతున్నా సరైనస్పందన లభించడంలేదని ప్రజలు చెబుతున్నారు. ఇదే విషయమై దౌల్తాబాద్ మండల తహసీల్దార్ వెంకటస్వామిని ఫోన్‌ద్వారా వివరణకోరగా ఆయన స్పందించలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్ దరఖాస్తులను పరిశీలించి, వెంటనే ధ్రువీకరణ పత్రాలు జారీచేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, మండల ప్రజలు కోరుతున్నారు.

రైతుల సమక్షంలోనే సమగ్ర భూసర్వే

-రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం సర్వే పూర్తి

-సమీక్షాసమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

-పాల్గొన్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపి ఈటల, పలువురు ఎమ్మెల్యేలు, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు

జగిరి, రంగారెడ్డి మరియు వికారాబాద్ జి
రెవెన్యూ సమీ సమావేశము
మావేశ మందిరము ల్ - మల్కాజ్‌గిరి జిల్లా

మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి డి.శ్రీధర్‌బాబు తదితరుల దృశ్యం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 4, ప్రభాతవార్త:

రైతుల సమక్షంలోనే సమగ్ర భూసర్వే జరుగుతుందని, ఏడాదిలోపే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం సమగ్ర భూసర్వే పూర్తికానున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లో మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల (ఉమ్మడి జిల్లాల) భూసమగ్రసర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై మంత్రి డి.శ్రీధర్‌బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానంగా రైతుల ప్రయోజనాల కోసమే భూముల రీసర్వే చేపడుతున్నామని, రైతుల భూసమస్యల పరిష్కారానికి వారి సమక్షంలోనే రీసర్వే జరగాలని అధికారులను ఆదేశించారు. రీసర్వే జరిగే గ్రామాలను ప్రతి రోజు తహసీల్దార్లు పర్యటించాలని ఆర్‌డిఓ, అదనపు కలెక్టర్‌లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, కనీసం వారానికి ఓసారి రీసర్వే జరిగే గ్రామాలకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. భూయజమానులకు పూర్తి భద్రతతో కూడిన వివాదరహిత భూములను అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో వారి భూమికి సంబంధించి సమగ్ర భద్రతతో కూడిన రికార్డులు, పాస్‌బుక్కులు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూరీసర్వే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, చట్టంలో నిర్దేశించిన విధంగా తొలుత రాష్ట్రంలోని జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో మొదటి విడతగా రీసర్వేను వేగవంతంచేయాలన్నారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా సమీక్షలు హైదరాబాద్‌లో నిర్వహించామని, ఇక జిల్లాలవారీగా సమీక్షలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధుల, ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయి అధికారుల జాబితా నుంచి యాదృచ్ఛికంగా అధికారులను ఎంపికచేసి ఆయా మండలాల్లో సర్వేకు సంబంధించిన అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై నేరుగా చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమస్యలను దాచిపెట్టకుండా స్పష్టంగా తెలియజేస్తే అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరిస్తూ బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందన్నారు. సమస్యలను తప్పుదోవ పట్టించే లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై అదేస్థాయిలో తక్షణచర్యలు ఉంటాయని మంత్రి అధికారులను హెచ్చరించారు. దాదాపు 125ఏళ్ల క్రితం జరిగిన సర్వే తరువాత రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృతస్థాయిలో సమగ్ర భూసర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా కేవలం భూముల కొలతలకు మాత్రమే పరిమితం కాకుండా, సర్వే నెంబర్లు ఒక చోట ఉండటం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల భూముల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టాభూములకు సంబంధించిన సమస్యలు, భూముల హద్దులపై నెలకొన్న వివాదాలు వంటి అంశాలను కూడా సమగ్ర సర్వే ద్వారా గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. 22ఎకు సంబంధించి ఇప్పటి వరకు ఇచ్చిన జిఒలు, మెమోలతో కవర్ కాని అంశాలు ఏమైనా ఉంటే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న భూసర్వేపై ఎంపి, పలువురు ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సమావేశంలో వారితో పాటు మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, వీర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ మూడు జిల్లాల కలెక్టర్లు మనుచౌదరి, నారాయణరెడ్డి, దీపక్‌తివారి, జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పీఠం ఎవరికి?

-జనరల్ వంతు కావడంతో పెరిగిన ఆశావహులు

-ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి చుట్టూ ప్రదక్షిణలు

-అభ్యర్థుల సంఖ్యతో ఎమ్మెల్యేపై పెరుగుతున్న ఒత్తిడి

ఆమనగల్లు, నవంబరు 4, ప్రభాతవార్త:

ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందన్న అంశం ప్రస్తుతం నియోజకవర్గ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ప్రస్తుత మార్కెట్‌కమిటీ పాలకవర్గం పదవీకాలం ఈ నవంబరు 21తో ముగియనుండటంతో తదుపరి ఛైర్మన్ ఎంపికపై అధికార కాంగ్రెస్ పార్టీలో అప్పుడే రాజకీయవేడి మొదలైంది. ఈసారి ఛైర్మన్ పదవి జనరల్ వంతు కావడంతో ఆశావహుల సంఖ్య కూడా పెరుగుతోంది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని జనరల్ అభ్యర్థులు రంగప్రవేశం చేయగా, తమకు అవకాశం కల్పించాలంటూ ఇతర కేటగిరికి చెందిన పలువురు నాయకులు అధిష్ఠానంపెద్దల వద్ద ప్రయత్నాలు ముమ్మరంచేస్తున్నారు. ఆమనగల్లు మార్కెట్‌యార్డ్ పరిధిలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలు ఉన్నాయి. దీంతో నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు ఛైర్మన్ పదవిపై కన్నేసినట్లు అధికార పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో ప్రధానంగా ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బట్టు కిషన్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, సూదిని శ్రీనివాస్‌రెడ్డి, దళితనాయకుడు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, తలకొండపల్లి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం తాము చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న పరిచయాలు, రాజకీయ అనుభవాన్ని ప్రస్తావిస్తూ తమకు అవకాశం కల్పించాలని ఆశావహులు అధిష్ఠానపెద్దల వద్ద ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. జనరల్ కేటగిరీ కావడంతో ఈసారి పదవి కోసం పోటీ మరింత రసవత్తరంగా మారింది. ఛైర్మన్ పదవిని దక్కించుకోవాలనే లక్ష్యంతో ఆశావహులు తమ రాజకీయ ప్రయత్నాలకు పదునుపెడుతున్నారు. నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిల మద్దతుపొందేందుకు ప్రయత్నాలుచేస్తున్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చజరుగుతోంది. తమకు అవకాశం కల్పిస్తే మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి, రైతులసంక్షేమానికి కృషితోపాటు పార్టీ బలోపేతానికి సేవలందిస్తామని నాయకులు తమ వాదనలు వినిపిస్తున్నట్లు సమాచారం. మార్కెట్‌యార్డు చరిత్రలో ఛైర్మన్‌పదవిని ఒక్కసారి కూడా ఆమనగల్లు పట్టణాన్ని వరించలేదని ఆశావహులు ఈసారి బలంగా వాదన తీసుకువస్తున్నారు. ఎవరికివారు బలంగా ప్రయత్నిస్తుండటంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఛైర్మన్ ఎంపిక వ్యవహారం రాజకీయంగా కీలకంగా మారింది. ఎవరికి అవకాశం కల్పించినా మిగతా ఆశావహులను సమన్వయం చేయాల్సిన బాధ్యత ప్రస్తుతం ఎమ్మెల్యేపై పడనుంది. పార్టీశ్రేణుల్లో అసంతృప్తి తలెత్తకుండా, అందరినీ కలుపుకొనివెళ్లే విధంగా నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఎంపి మల్లు రవి అభిప్రాయం కూడా ఎంపికలో ప్రాధాన్యత సంతరించుకుంటుందన్న చర్చసాగుతోంది. ప్రస్తుతం ఛైర్మన్ యాట గీతనర్సింహ్మ నేతృత్వంలోని పాలకవర్గం పదవీకాలం నవంబరు 21తో ముగియనుండటంతో కొత్త ఛైర్మన్ ఎంపికపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. పార్టీ అధిష్ఠానం ఎవరికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తుంది? ఎమ్మెల్యే కసిరెడ్డి ఆశీస్సులు ఎవరికి మద్దతుగా నిలుస్తాయి? ఎంపి మల్లు రవి అభిప్రాయం ఏమిటి? అన్న ప్రశ్నలు అధికారపార్టీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. మొత్తానికి ఆమనగల్లు మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ పదవి అధికారకాంగ్రెస్‌పార్టీలో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపుతోంది. ఆశావహుల ప్రయత్నాలు, ముఖ్యనాయకుల నిర్ణయాలు, సామాజిక సమీకరణాలు చివరకు ఎవరికి అనుకూలిస్తాయోనన్న ఉత్కంఠత రాజకీయ వర్గాల్లో నెలకొంది. మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ పీఠం దక్కించుకుని నాలుగు మండలాల్లో పార్టీలో మరింత క్రియాశీలకంగా ఎదగాలని నేతలు తహతహలాడుతున్నట్లు వినిపిస్తుంది.

రైస్ మిల్లులపై విజిలెన్స్ మెరుపుదాడులు

-బ్రాండెడ్ బ్యాగుల్లో రేషన్ బియ్యం.. ఇదే నయా దందా..?

-మిల్లులో 150 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

-ఉప్పరిగూడ గణేష్ ఆగ్రో ఇండస్ట్రీస్‌లోనూ తనిఖీలు

-92 బస్తాల్లో మరోనిల్వ గుర్తింపు

-200కుపైగా గన్నీ బ్యాగులు స్వాధీనం

విజిలెన్స్ అధికారులు పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న దృశ్యం

ఇబ్రహీంపట్నం, నవంబరు 4, ప్రభాతవార్త:

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంపై విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు కొరడా ఝుళిపించారు. విజిలెన్స్ ఎస్‌పి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు బృందాలు మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని రైస్‌మిల్లులపై రెండోరోజు మెరుపుదాడులు నిర్వహించాయి. మంచాల మండలంలోని రాఘవేంద్ర రైస్ మిల్లులో 150 క్వింటాళ్ల పిడిఎస్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఉప్పరిగూడలోని గణేష్ ఆగ్రో ఇండస్ట్రీస్‌లోనూ రేషన్‌బియ్యం పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. మంచాల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న రాఘవేంద్ర రైస్‌మిల్లులో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి 19 రకాల బ్రాండ్ల పేర్లతో కొత్త సంచుల్లో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మిల్లుకు సమీపంలోని మరో మూడు ప్రైవేటు షెడ్లలో తనిఖీలు చేయగా 50కిలోల సామర్థ్యం కలిగిన 92 బస్తాల రేషన్‌బియ్యం లభించింది. ధాన్యం కొనుగోలుకేంద్రాలకు సంబంధించిన 200కుపైగా గన్నీ బ్యాగులను కూడా గుర్తించారు. వాటికి సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేయాలని ఎస్‌పి ఆదేశించారు. మిల్లును సీజ్‌చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిఎస్ఒ వనజాతకు సూచించారు. రాఘవేంద్ర రైస్‌మిల్లుకు లైసెన్స్‌లేదని, కాలుష్యనియంత్రణ మండలి అనుమతులు కూడా తీసుకోలేదని విజిలెన్స్ ఎస్‌పి రామ్‌కుమార్ తెలిపారు. ధాన్యం కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన ఆధారాలు, పత్రాలు లభించలేదన్నారు. కొత్త సంచుల్లో రేషన్ బియ్యం నింపి విక్రయిస్తున్నట్లు గుర్తించామని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజిలెన్స్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. అక్రమ బియ్యం నిల్వలు, రీసైక్లింగ్ వెనుక ఉన్నవారిని గుర్తించేందుకు అధికారులు విచారణ చేపట్టారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి..

-అధికారులకు ఎస్‌పి స్నేహ మెహ్రా దిశానిర్దేశం

వికారాబాద్/కొడంగల్, నవంబరు 4, ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈనెల 7,8,9 తేదీల్లో కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగసభ, రైతుమేళా, వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుచేపట్టాలని జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షాసమావేశంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ మ్యాపింగ్, పార్కింగ్ ఏర్పాట్లు, పోలీసు సిబ్బంది విధుల కేటాయింపుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా ఎస్‌పి సమగ్రంగా దిశానిర్దేశంచేశారు. ముఖ్యమంత్రి పర్యటించేప్రాంతాలు, బహిరంగ సభాప్రాంగణం, రైతుమేళా నిర్వహించే ప్రదేశాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరిగే ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ పాయింట్లను మ్యాపింగ్ ద్వారా వివరించారు. ప్రతి పోలీసు అధికారి కేటాయించిన ప్రాంతం, విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి, సమన్వయ లోపానికి తావులేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి పర్యటన సమయంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. సభాప్రాంగణం, రైతుమేళా పరిసర ప్రాంతాల్లో నిరంతరనిఘా ఏర్పాటుచేసి అవసరమైన చోట పోలీసుబలగాలను మోహరించాలని సూచించారు.

సభాస్థలిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

సమావేశం అనంతరం ఎస్‌పి క్షేత్రస్థాయిలో పర్యటించి ముఖ్యమంత్రి పర్యటన స్థలాలను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలుసూచనలు చేశారు. అన్నివిభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి రాజేష్ మీనా, డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య, డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్, పరిగి డిఎస్‌పి ఎన్. శ్రీనివాస్, తాండూరుడిఎస్‌పి నర్సింగ్‌యాదయ్య, ఎఆర్ డిఎస్‌పి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు ఆత్మహత్య

-కుటుంబకలహాలే కారణం అంటున్న గ్రామస్తులు

మర్పల్లి, నవంబరు 4, ప్రభాతవార్త:

మర్పల్లి మండలంలోని తుమ్మలపల్లి ప్రభుత్వపాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మంగళి వీరేశం ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ కలహాలే ఆయన ఆత్మహత్యకు కారణం అయి ఉండవచ్చని గ్రామస్తులు అంటున్నారు. వీరేశం స్వంతగ్రామం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పీచరాగిడి. సంగారెడ్డిలో నివాసం ఉంటూ మర్పల్లి మండలంలోని తుమ్మలపల్లి పాఠశాలలో విధులు నిర్వహిస్తూ, రోజూ రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారంరాత్రి సంగారెడ్డిలో తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో తుమ్మలపల్లి గ్రామంలో విషాదంనెలకొంది. సాటి ఉపాధ్యాయుడు ఆత్మహత్యచేసుకొని మరణించడంపై సాటి ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేస్తున్నారు.

మంబాపూర్‌లో మోటార్ కేబుల్ వైర్ చోరీ

పెద్దేముల్, నవంబరు 4, ప్రభాతవార్త:

పెద్దేముల్‌మండలంలోని మంబాపూర్‌గ్రామంలో మంగళవారంరాత్రి దొంగలు హల్చల్ సృష్టించారు. మంబాపూర్ గ్రామానికి చెందిన కురువ శ్రీనివాస్, ద్యావరి గోపాల్‌రెడ్డి, బల్ల రాములు తదితరులు ఎప్పటి మాదిరిగానే తమ వరి పొలాలకు నీరు పారబెట్టేందుకు వెళ్లి చూడగా, బోరు మోటార్ల కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ సందర్భంగా కోట్‌పల్లి ఎఎంసి డైరెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో కూడా ఒకేరోజు సుమారు 40మంది రైతులకు చెందిన బోరు మోటార్ల కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారని గుర్తుచేశారు. మళ్లీ మంగళవారంరాత్రి కూడా నలుగురు రైతులకు సంబంధించిన కేబుల్ వైర్లను అపహరించుకుపోయారని తెలిపారు. పంటలు చేతికొచ్చే దశలో బోరు మోటార్ వైర్లను అపహరించుకపోవడం వల్ల పంటలకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కావున మంబాపూర్ గ్రామంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని, కేబుల్ వైర్ల దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 9 మందికి జైలు

మేడ్చల్, నవంబరు 4, ప్రభాతవార్త:

మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నిందితులకు మేడ్చల్‌లోని అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో శిక్షపడింది. 21 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను విచారించి ఒకసారికంటే ఎక్కువసార్లు మద్యంసేవించి వాహనాలు నడిపిన 9 మందికి న్యాయస్థానం జైలుశిక్ష విధించడంతోపాటు రూ.30,100ల జరిమానా విధించింది. అందులో ఒకరికి 3రోజులు, ఐదుమందికి 5రోజులు, ఒకరికి 7రోజులు, ఇద్దరికి 10రోజుల జైలుశిక్ష పడింది. మద్యంసేవించి వాహనాలు నడపడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని ఈ సందర్భంగా మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ విజయా రెడ్డి

జూబ్లీహిల్స్, నవంబరు 4, ప్రభాతవార్త:
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి పి. విజయారెడ్డి అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని లక్డీకాపూల్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో మాట్లాడి మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సమ రామ్మోహన్‌రెడ్డికి మద్దతుగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె. రఘువీర్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

జలమండలిలో సుధీర్ఘ సేవలు...

పదవి విమరణ పొందిన జలమండలి సిబ్బందికి ఘన సన్మానం..

అఫ్జల్‌గంజ్, నవంబర్ 4ప్రభాతవార్త:
ప్రజలకు సుదీర్ఘ కాలం పాటు విశేష సేవలందించిన పదవి విమరణపొందిన జలమండలి సిబ్బందికి అఫ్జల్‌గంజ్ జలమండలి సెక్షన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రెడ్‌హిల్స్ జలమండలి జనరల్ మేనేజర్ జలీల్ అల్తాఫ్‌హుస్సేన్ మాట్లాడుతూ సాంకేతిక లేని రోజుల్లో సైకిళ్లపై, కాలినడక వెళ్లి వాల్స్ ద్వారా ప్రజలకు మంచినీరు సకాలంలో అందించిన బాబయ్య, లక్ష్మయ్యలను నేటి తరం జలమండలి సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పదవి విమరణ పొందిన వారిని శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్‌గంజ్ జలమండలి మేనేజర్ కులశేఖర్, మహ్మద్ ఇమ్రాన్, రిటైర్డ్ జలమండలి ఇంజనీర్లు జగదీశ్వర్, రమేష్, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

బోరబండ అభివృద్ధికి సహకరించాలి : బాబా ఫసియుద్దీన్

మంత్రి వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన గ్రేటర్ మాజీ ఉప మేయర్ బాబా ఫసియుద్దీన్.

యూసుఫ్‌గూడ, నవంబర్ 04, ప్రభాతవార్త :
బోరబండ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసే విధంగా సహాయ సహకారాలు అందించాలని గ్రేటర్ మాజీ ఉప మేయర్ బాబా ఫసియుద్దీన్ బుధవారం మంత్రి వెంకటస్వామికి విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సమక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చూస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, ఎజాజ్‌బేగ్, వలి తదితరులు పాల్గొన్నారు.

గాయిత్రినగర్ కనెక్టివ్ రోడ్డును పరిశీలించిన హైడ్రా అధికారులు

నూతనంగా ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, హైడ్రా అధికారులు.

యూసుఫ్‌గూడ, నవంబర్ 4, ప్రభాతవార్త :
గాయిత్రినగర్ కాలనీ నుంచి అయ్యప్ప సొసైటీకి వెళ్లే అనుసంధానం రహదారి పనులను బుధవారం డివిజన్ మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, హైడ్రా అధికారులు పరిశీలించారు. అందుకుగాను రోడ్డు మార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. చెరువును సుందరీకరిస్తున్న పనుల్లో భాగంగా రహదారి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కాలనీ వాసులు అధికారులను కోరారు. ఈ రహదారి ఏర్పాటు చేయటం వల్ల కాలనీ వాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సాఫీగా వెళ్లే విధంగా ఉంటుందని దీంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వేముల కృష్ణారావు, నాగుల సత్యం, శ్రీలత, నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ఇన్స్‌పెక్టర్ వినాయకరావు, కాంట్రాక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటి సిఎం భట్టిని కలిసిన పవర్ ఎంప్లాయిస్ జెఎసి

విద్యుత్ ఉద్యోగులకు డిఏ మంజూరు చేయడం పట్ల హర్షం

డిప్యూటీసిఎంభట్టితో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, సెక్రటరీ జనరల్ శ్రీధర్, వెంకటేశ్వర్లు, వజీర్, సదానందం తదితరులు

హైదరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులకు 2.543శాతం డిఏ మంజూరు చేయడం పట్ల తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు గురువారం అసోసియేషన్ కన్వీనర్ రత్నాకర్‌రావు, సెక్రటరీ జరల్ శ్రీధర్‌ల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొక్కె అందజేసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా విద్యుత్ సంస్థల్లో నెలకొన్న పలు సమస్యలపై మంత్రితో చర్చించారు. విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో భాగంగా పిఆర్‌సి-2026 వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరాగా మంత్రి సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ం సంస్థల్లో పనిచేస్తున్న ఇంజనీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు సమిష్టి కృషితో నిరంతరాయ విద్యుత్ సరఫరాను అందించడం అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులకు, గృహ వినియోగదారులకు, పారిశ్రామిక సంస్థలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగుల సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో 1104 ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ వజీర్, సదానందం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రక్త భాగాల నాణ్యతా ప్రమాణాలపై నిమ్స్‌లో సిఎంఈ, వర్క్‌షాప్

జూబ్లీహిల్స్, నవంబరు 4, ప్రభాతవార్త: రక్త భాగాల నాణ్యతా ప్రమాణాలపై నిమ్స్‌లో సీఎంఈ, వర్క్‌షాప్ రక్త మార్పిడి సేవల్లో నాణ్యతా ప్రమాణాలను బలోపేతం చేయడంతో పాటు, రోగులకు మరింత సురక్షితమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిమ్స్‌లో సీఎంఈ, వర్క్‌షాప్ నిర్వహించారు. నిమ్స్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హీమటాలజీ అండ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ (ఐహెచ్‌బీటీ) ఆధ్వర్యంలో బుధవారం "సమగ్ర రక్త గడ్డకట్టే ప్రక్రియ పరిశీలన ద్వారా రక్త భాగాల నాణ్యతా ప్రమాణాల బలోపేతం అనే అంశంపై ఈ కార్యక్రమం జరిగింది. నిమ్స్ కార్యనిర్వాహక రిజిస్ట్రార్ డాక్టర్ పరంజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐహెచ్‌బీటీ అదనపు ప్రొఫెసర్ డాక్టర్ కె. మహేశ్ కుమార్ స్వాగతం పలుకుతూ రక్త మార్పిడి వైద్యంలో నిరంతర వైద్య విద్య, శాస్త్రీయ చర్చలు, నిపుణుల మధ్య పరస్పర సహకారం ప్రాధాన్యతను వివరించారు. ఐసీఎంఆర్-డీహెచ్‌ఆర్ శాస్త్రవేత్త డాక్టర్ గీతాంజలి సాగీనా తొలి ఉపన్యాసం చేశారు. న్యూఢిల్లీకి చెందిన రక్త మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ సంగీతా పాఠక్, డాక్టర్ అసీమ్ తివారీ, మైసూరుకు చెందిన డాక్టర్ పల్లవి ప్రకాశ్ ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. రక్తంలోని వివిధ భాగాల తయారీ, పరీక్షలు, నాణ్యతా నియంత్రణ, రక్తం గడ్డకట్టే ప్రక్రియను సమగ్రంగా పరిశీలించే విధానాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. వివిధ ఆసుపత్రులు, వైద్య కళాశాలలకు చెందిన నిపుణులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి నిమ్స్ ఐహెచ్‌బీటీ విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ వి. సుధీర్ కుమార్ అధ్యక్షత వహించగా, డాక్టర్ కె. మహేశ్ కుమార్ కార్యదర్శిగా వ్యవహరించారు. సింధు, యశోద, ఏఐజీ, ఈఎస్ఐ, నారాయణ వైద్య కళాశాలలు, ఎయిమ్స్ బీబీనగర్ తదితర సంస్థలకు చెందిన వైద్య నిపుణులు, అధ్యాపకులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి మొత్తం 196 మంది ప్రతినిధులు నమోదు చేసుకోగా, వారిలో 65 మంది ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్త భాగాల నాణ్యత, భద్రతను మెరుగుపరచడంతో పాటు శాస్త్రీయ ఆధారాలతో కూడిన రక్త మార్పిడి విధానాలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

వైవిధ్యభరిత అద్భుత పద గేయకర్త రామజోగయ్య శాస్త్రి : సుద్దాల అశోక్ తేజ

చిక్కడపల్లి నవంబర్ 4 (ప్రభాతవార్త): సందర్భోచిత పాటలను వైవిధ్యభరితంగా, అద్భుతంగా రాయగలిగే శక్తి ఉన్నవారిలో విఖ్యాత భావకవి దేవులపల్లి కృష్ణకి సమానం ప్రముఖ సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి అని ప్రముఖ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ కొనియాడారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్, లేని రచయిత్రుల వేదికల ఉమ్మడి నిర్వహణలో విఖ్యాత భావకవి దేవులపల్లి కృష్ణ శాస్త్రి జయంతి వేడుకలు డాక్టర్ వంశీ రామరాజు నిర్వహణలో జరిగాయి. ఈ సందర్భంగా రామజోగయ్య శాస్త్రికి ప్రతిష్ఠాత్మక దేవులపల్లి కృష్ణ శాస్త్రి పురస్కారాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న సుద్దాల అశోక్ తేజ తనతో పాటు సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు తెలుగు అకాడమీ చైర్మెన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ తో కలసి రామ జోగయ్య శాస్త్రి కి బహుకరించి మాట్లాడారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ దేవులపల్లి కృష్ణ శాస్త్రి రాసిన గీతాలు మల్లెల గుబాళింపు లాంటివని అశోక్ తేజ అభివర్ణించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ దేవులపల్లి కృష్ణ శాస్త్రి కవిత్వ వైభవాన్ని ఆవిష్కరించారు. రామజోగయ్య శాస్త్రి తన గురువు సిరివెన్నెల సీతారామకి నిజమైన వారసుడని అభినందించారు. ఈ కార్యక్రమానికి సుంకరపల్లి శైలజ నిర్వహణ బాధ్యతలు వహించారు. ఈ వేడుకలో పలువురు సాహితీవేత్తలు, కళాకారులు, లేని రచయిత్రుల వేదిక ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ విద్య

-ఫ్రీ గురుకుల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:
ఫ్రీగురుకుల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం ఉచిత డిజిటల్ విద్యా సేవను ప్రారంభించింది. మ్యాథ్స్, సైన్స్ సంబంధిత అంశాల్లో అదనపు విద్యా సహాయాన్ని వెబ్సైట్, మొబైల్ యాప్ ద్వారా అందిస్తోంది. ఈ సేవ కోసం దాదాపు 15 మంది ఉపాధ్యాయుల సహకారంతో సుమారు మూడు సంవత్సరాల పాటు విద్యా వీడియోలను పరిశీలించి, ఎంపిక చేసి, క్రమబద్ధీకరించారు. విద్యార్థులు తమ తరగతి, సబ్జెక్టు, చాప్టర్, టాపిక్ ఆధారంగా అవసరమైన పాఠాలను సులభంగా చూడగలిగేలా ఏర్పాటు చేశారు. కష్టమైన టాపిక్ ను సులభంగా అర్థం చేసుకోవడానికి యానిమేషన్, విజువల్ వీడియోలు అందుబాటులో ఉన్నాయి. ఒకే అంశాన్ని వేర్వేరు ఉపాధ్యాయులు వివరించిన వీడియోలను చూడవచ్చు. అర్థం కాని పాఠాలను మళ్లీ మళ్లీ చూసి రివిజన్ చేసుకోవచ్చు. సబ్జెక్టుకు సంబంధించిన సందేహాలకు సహాయంగా ఏఐ చాట్ సదుపాయం కూడా ఉంది. విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో, తల్లిదండ్రుల మార్గదర్శకత్వంతో ఈ సేవను ఉపయోగించుకోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ప్రైవేట్ ట్యూషన్ అదనపు స్టడీ మెటీరియల్ అందుబాటులో లేని కుటుంబాలకు ఈ సేవ ఉపయోగపడాలనేది ఫౌండేషన్ లక్ష్యమని వ్యవస్థాపకులు కె.రాజారమేష్ రెడ్డి తెలిపారు. ఇది పాఠశాల విద్యకు ప్రత్యామ్నాయం కాదని తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ఇంటి వద్ద మరింత బాగా అర్థం చేసుకోవడానికి, పరీక్షలకు సిద్ధమవడానికి తోడ్పడే అదనపు విద్యా వనరు మాత్రమేనని ఈ విద్యా సేవ విద్యార్థులకు పూర్తిగా ఉచితమని తెలిపారు.

విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ ఛార్జీల భారం మోపడం దారుణం : నల్లెల్ల కిషోర్

సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ముషీరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త:
విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ ఛార్జీల భారం మోపడం దారుణమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నల్లెల్ల కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులపై మరోసారి భారీ భారం మోపేందుకు రంగం సిద్ధమయిందని, గత రెండు సంవత్సరాల ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ కొనుగోళ్లు, ఆదాయ వ్యత్యాసాల సర్దుబాటు పేరుతో విద్యుత్ నియంత్రణ మండలి ట్రూ అప్ ఛార్జీల వసూళ్లకు ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రభుత్వ అసమర్ధ ఆర్థిక నిర్వహణ కారణంగా దాదాపు 29 నెలల పాటు సామాన్యులపై విద్యుత్ వాత పడబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల వైఫల్యాలు, ఆర్థిక లోపాలను ప్రజలపై రుద్దే ఈ ట్రూ అప్ విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ పి.బాలరాజ్‌గౌడ్, శ్యాంసుందర్, తడక వినోద్, భానుప్రకాష్, కరణం కరణ్, భవాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత,సమానత్వంపై అవగాహన

కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ రాంబాబు

చార్మినార్ నవంబరు 4 ప్రభాతవార్త :
విద్యాలయాలు, పని చేస్తున్న ప్రదేశాలలలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న లింగ, వివక్ష, వేధింపులు అసమాన అవకాశాలపై ప్రభుత్వసిటీ కళాశాలలో అవగాహన పెంపొందించడంతో పాటు వారి హక్కులు భద్రతపై చైతన్యం కల్పించేందుకు బుధవారం స్టాండ్ విత్ హర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణప్రభుత్వ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళలు పని చేసే ప్రదేశాలలో ఎదుర్కొనే వివక్ష, వేధింపులు, అసమాన అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతీ మహిళ తన హక్కులగురించి తప్పకుండ తెలుసుకోవాలని, మహిళ రక్షణ కోసం పోలీస్ శాఖ, భరోసా కేంద్రం అందిస్తున్న సేవలు గురించి ఆయన వివరించారు. సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చార్మినార్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు రామేశ్వర్ రెడ్డి, బి. ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వై. వాసుదేవ్ రెడ్డి, మీర్‌చౌక్ భరోసా కేంద్రం ప్రతినిధులతో పాటు కళాశాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 4, ప్రభాతవార్త
తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దామోదర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో వారు పార్టీలో చేరగా, కేటీఆర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రజలకు అభివృద్ధి కంటే ఇబ్బందులే ఎక్కువగా ఎదురవుతున్నాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

ప్రగతి నగర్‌లో వ్యభిచార ముఠా గుట్టురట్టు..

కొంపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త
ప్రగతి నగర్‌లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఏహెచ్‌టీయూ (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్), బాచుపల్లి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో ఇద్దరు నిర్వాహకులతో పాటు ఒక బాధిత మహిళ, ఒక విటుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో జూడియో షాపింగ్ మాల్ వెనుక ఉన్న ప్రకాష్ ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నంబర్ 207లో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బుధవారం రాత్రి ఏహెచ్‌టీయూ, బాచుపల్లి పోలీసులు సంయుక్తంగా సదరు ఫ్లాట్‌పై తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో విజయవాడకు చెందిన తూము కిరణ్, ఆయన భార్య దుర్గాభవానితో పాటు ఒక బాధిత మహిళ, ఒక విటుడిని అదుపులోకి తీసుకు న్నారు. వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిందితులపై పీటా చట్టం కింద కేసు నమోదు చేశారు.

26 కిలోలకు 25 కిలోల బరువు మాత్రమే..

కార్వాన్, నవంబర్ 4(ప్రభాతవార్త) గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధనశ్రీ రైస్ ట్రేడర్స్‌లో గుడిమల్కాపూర్ పోలీసులతో పాటు పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. తనిఖీలో సదరు వ్యాపారి 25 కేజీల బియ్యం బస్తాలను 26 కేజీలుగా తప్పుగా చూపించి వినియోగదారులను మోసం చేస్తున్నట్టు గుర్తించామని, తప్పుడు తూనికలు గల బియ్యం స్టాక్ సీజ్ చేసినట్టుగా గుడిమల్కాపూర్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ సి.హెఛ్ రామయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 26 కిలోలని లేబుల్ వేసిన బియ్యం బస్తాలను తనిఖీ చేయగా, అందులో కేవలం 25 కిలోల బరువు మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రతి బస్తాలో సుమారు ఒక కిలో వరకు తూకంలో మోసం జరుగుతున్నట్లు తేలింది. అధికారులు అక్కడ ఉన్న సుమారు 60 బియ్యం బస్తాలను సీజ్ చేశారు. ఈ విషయం పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. తూనికల మోసాలకు పాల్పడినందుకు మరియు లైసెన్స్ లేనందున, సంబంధిత షాపు యజమానిని మరియు సీజ్ చేసిన బియ్యాన్ని గుడిమల్కాపూర్ పోలీసులకు అప్పగించారు. చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయని గుడిమల్కాపూర్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ సి.హెఛ్ రామయ్య, ఎస్సై చకవర్థిలు పేర్కొన్నారు.

గ్రంథ ఆవిష్కరణలు, శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు ఉచితం

-గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దనమూర్తి వెల్లడి

కళా సేవకు అంకితమైన సంస్థ
365 రోజులు ఉచిత కళా వేదిక
GANASABHATV1966

గానసభ పాలకమండలి తీసుకున్న నిర్ణయాలను వెల్లడిస్తున్న అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దనమూర్తి

చిక్కడపల్లి నవంబర్ 4 ప్రభాతవార్త : చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఇకపై గ్రంథ ఆవిష్కరణలు, సాహితీ సమావేశాలు, శాస్త్రీయ సంగీత కార్యక్రమాలను పూర్తిగా ఉచితంగా నిర్వహించాలని పాలక మండలి సంచలన తీర్మానం చేసినట్లు గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలిపారు. బుధవారం గానసభలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వివిధ సంస్థల ద్వారా నిర్వహించే సాహితీ, శాస్త్రీయ సంగీత కార్యక్రమాలకు వేదికలను ఉచితంగా కేటాయించేవారమని, ఇకపై ఈ కార్యక్రమాలను గానసభ స్వయంగా నిర్వహిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రదర్శనలు, సమావేశాలకు అయ్యే ఖర్చులు, బ్యానర్లు, ప్రచారం వంటి వ్యయాన్ని కూడా గానసభయే స్వయంగా భరిస్తుందని వివరించారు. రచయితలు తాము ఆహ్వానించాలనుకునే అతిథులను స్వయంగా ఎంచుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు జనార్దనమూర్తి తెలిపారు. రచయితలు ఎంచుకున్న సమయానికి అందుబాటులో ఉన్న హాలును కేటాయిస్తామని స్పష్టం చేశారు. కళాకారులు, రచయితలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు త్యాగరాయ గానసభ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. గానసభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు స్మృతికి నివాళిగా ఈ ఉచిత కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో ఆయన పేరిట పేదవారి కోసం ఉచిత కళ్యాణ వేదికలను అందించే పథకం ప్రారంభించామని, గత మూడేళ్లుగా ఆ పథకం విజయవంతంగా అమలువుతోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సమావేశంలో గానసభ ప్రధానకార్యదర్శి కళా శారద దీక్షితులు, కళా రామచంద్రమూర్తి, కళా మహా లక్ష్మీ, ఎస్వీ శ్రీనివాస్, కళా పద్మజ నీలిమ, తాళ్లపల్లి చక్రపాణి, భమిడి ఉష, కళా లలిత, గుండవారపు గీతా దేవి, బండి శ్రీనివాస్, బండి నాగ జ్యోతి, సి హెచ్ వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో పౌరాణిక, పద్య, సాంఘిక నాటకోత్సవాలు

చిక్కడపల్లి నవంబర్ 4 (ప్రభాతవార్త): తెలుగు నాటక రంగానికి నిలయమైన కిన్నెర ఆర్ట్ థియేటర్స్ 49వ వార్షికోత్సవ నాటకోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించబోతున్నట్లు సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురాం వివరించారు. ప్రతిరోజూ సాయంత్రం 6.00 గంటలకు అద్భుతమైన పౌరాణిక, పద్య మరియు సాంఘిక నాటకోత్సవాలను నిర్వహిస్తోంది. తెలుగు నాటక ప్రియులను అలరించడానికి వివిధ ప్రాంతాల నుండి ప్రసిద్ధ నాటక బృందాలు ఈ వేదికపై తమ కళా ప్రదర్శనలను ఇవ్వనున్నాయి. 14 న స్వర్గీయ పానుగంటి లక్ష్మీనరసింహం పంతులు రచించిన, డాక్టర్ విభానుపూడి సుబ్బరాజు వహించిన పాదుకా పట్టాభిషేకం" (పౌరాణిక నాటకం) ను సుమిత్ర యూత్ అసోసియేషన్ (ఖమ్మం) , 15 న శ్రీ సర్వేశ్వర నాట్య మండలి (హైదరాబాద్) వారిచే "శ్రీకృష్ణ రాయ బారం" (పౌరాణిక పద్యనాటకం), 16 న సి.ఎస్.ఆర్ కళామందిరం (హైదరాబాద్) వారిచే "చింతామణి" (సాంఘిక పద్య నాటకం), 17 న జి.పి.ఎల్.మీడియా (హైదరాబాద్) వారిచే చిత్రాంగి" (చారిత్రక పద్యనాటకం), 18 న ఆహ్లాద్ క్రియేటివ్ థియేటర్స్ (హైదరాబాద్) వారిచే "శ్రీకాళ హస్తీశ్వర సాయుజ్యం, 19 న జయా ఆర్ట్ (హైదరాబాద్) వారిచే "డస్ట్ బిన్" (నాటిక). మూల కథ, డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి, నాటికీకరణదర్శకత్వం: డాక్టర్ శ్రీజ సాదినేని ప్రదర్శన ఉంటుందన్నారు. అదే రోజు రాత్రి ఎనిమిది గంటల నుండి తొమ్మిది గంటల వరకు స్వర్ణసూర్య డ్రామా లవర్స్ (హైదరాబాద్) వారిచే స్త్రీ మాత్రే నమః" (నాటిక). మూల కథ ఉంటున్నదన్నారు. 20 న ఆదర్శ యువ భారతి (హైదరాబాద్) వారిచే ఆటబొమ్మ" (నాటిక) , అదే రోజు రాత్రి ఎనిమిది గంటల నుండి తొమ్మిది గంటల వరకు కళాంజలి (హైదరాబాద్) వారిచే దిలకమ్మ చెప్పింది" (హాస్యనాటిక) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు నాటక కళను, సంస్కృతిని ప్రోత్సహించడానికి జరుగుతున్న ఈ ఉత్సవాలకు నాటక అభిమాను లందరూ విచ్చేసి విజయవంతం చేయాల్సిందిగా రఘురాం కోరారు.

బాణాసంచా దుకాణదారులతో సమన్వయ సమావేశం

గోషామహల్, నవంబర్ 4ప్రభాతవార్త: దీపావళి పండుగను పురస్కరించుకుని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో తాత్కాలిక, శాశ్వత బాణాసంచా దుకాణదారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గొల్కొండజోన్ అదనపు డిసిపి కృష్ణగౌడ్ మాట్లాడుతూ తప్పనిసరిగా లైసెన్సింగ్ తాత్కాలిక, శాశ్వత బాణాసంచా విక్రేతలు ప్రతి ఒకరుస్టాళ్లను ఏర్పాటు చేయడానికి ముందు సంబంధిత ప్రభుత్వశాఖల నుండి ఖచ్చితంగా చెల్లుబాటు అయ్యే అనుమతి తీసుకోవాలన్నారు. గోషామహల్ ఎసిపి కె. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక భద్రతా నియమాలు ప్రతి దుకాణంలో పని చేసే స్థితిలో ఉన్నఅగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనలకు లోబడిమాత్రమే బాణాసంచా నిల్వ చేసుకోవాలని వ్యాపారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణ భద్రతా నిబంధనల ఉల్లంఘన లేదా నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయన్నారు. కుల్సుంపురా, టోలిచౌకి ఎసిపిలు వి. తిరుపతి, సయ్యద్‌ఫయాజ్‌లు మాట్లాడుతూ ప్రజా భద్రతకు ప్రాధాన్యత, ప్రజల ప్రాణ ఆస్తి, నష్టాలకు తావులే కుండా, అత్యంత సురక్షితమైన వాతావరణంలో విక్రయాలు జరపాలని, వ్యాపారులకు సూచించారు. ప్రజా భద్రతకే తన శాఖ ప్రథమ ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఆసిఫ్‌నగర్ ఎసిపి కె. శ్రీనివాస్, గోషామహల్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, కుల్సుంపురా, టప్పాచబుత్రా, ఇన్‌స్పెక్టర్లు బి. శ్రావణ్‌కుమార్, మోహన్‌రావు, భరత్, రాములు, అసిస్టెంట్ డిస్టిక్‌ఫైర్ ఆఫీసర్ షణ్ముఖరావు, జిఎస్‌టి డిప్యూటి కమీషనర్ గిరిధర్, వాణిజ్యపన్నులశాఖ తదితరులు, బాణాసంచా అమ్మకందారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తా : డాక్టర్ రవి శేఖర్ రెడ్డి

దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ రవి శేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్, ఈవో తదితరులు

హైదరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త
తెలంగాణ రాష్ట్రంలోనే రెండో తిరుపతిగా పేరుగాంచిన, అత్యంత పురాతన పుణ్యక్షేత్రమైన అమ్మాపూర్‌లోని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ కురుమూర్తి స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వి. రవిశేఖర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆయన ఆలయాన్ని సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బత్తుల బాలరాజు, ఈవో మధునేశ్వర్ రెడ్డి, ధర్మకర్తలు భరత్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, అర్చకులు డాక్టర్ పి.వి. రవిశేఖర్ రెడ్డికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.వి. రవిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం మరింత అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఎంతో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ పుణ్యక్షేత్రం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

బాణాసంచా దుకాణల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి : సిఐ నవీన్‌కుమార్

యూసుఫ్‌గూడ, నవంబర్ 04, ప్రభాతవార్త :
దీపావళి వేడుకలకు బాణాసంచ దుఖానాలు ఏర్పాటు చేసుకునే ప్రతి ఒక్కరు తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని అల్లాపూర్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా బాణాసంచా దుఖాణాల దగ్గర తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దుఖాణ యజమానులు అగ్నిమాకపశాఖ, పోలీస్‌శాఖ, జీహెచ్ఎంసీ వారి ఎన్ఓసీలు తీసుకున్న తరువాతనే ఏర్పాటు చేసుకోవాలని అనుమతులు లేకుండా ఏర్పాటు చేసేవారిపై చర్యలు తీసుకోవడం జరుతుందని తెలిపారు.

మహిళ పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా.. అసభ్యకర పోస్టులు

జూబ్లీహిల్స్, నవంబర్ 04, ప్రభాతవార్త :
ఫిల్మ్‌నగర్‌లో ఓ మహిళ పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా సృష్టించి అసభ్యకర పోస్టులు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి చెల్లెలు నవంబర్ 3న ఫోన్ చేసి తన పేరుతో నకిలీ ఖాతా తెరిచినట్లు చెప్పడంతో ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పరిశీలించింది. తన పేరుతో నకిలీ ఖాతా సృష్టించి తన ఫోన్ నంబర్‌తో పాటు 2 వ్యక్తిగ ఫోటోలు వచ్చినట్లు గుర్తించింది. అంతేకాకుండా డబ్బుల కోసం అసభ్యకర రీతిలో లైంగిక సేవలు అందిస్తున్నట్లుగా పోస్టులు పెట్టారని పేర్కొంది ఈ వ్యవహారంలో తన పరువు ప్రతిష్టలకు భంగం కలగడంతో పాటు తన వ్యక్తిగత వృత్తిపరమైన జీవితంపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. నకిలీ ఖాతాను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది.

ఐదేళ్ల బాలుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు

నిందితుడిని అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించిన పోలీసులు.

యూసుఫ్‌గూడ, నవంబర్ 4, ప్రభాతవార్త :
బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సైట్3 అంజయ్యనగర్‌లో ఐదేళ్ల బాలుడి హత్య కేసులో సంబంధించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు విద్యాసాగర్ నల్లవారపు (33) ప్రైవేట్ ఉద్యోగిగా ఉంటూ ఇటీవల బాలుడిని హత్య చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు హాజరుపర్చి జ్యూడీషియ్ కస్టడీకి తరలించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ, బంగారు ఉంగరాలు మాయం.

యూసుఫ్‌గూడ, నవంబర్ 4, ప్రభాతవార్త :
బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. హనుమాన్ ఆలయ సమీపంలో ఓ వ్యక్తిని డబ్బులు అడిగి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లారు. మరో ఘటనలో ఇంట్లో భద్రపర్చిన ఐదు బంగారు ఉంగరాలు మాయమయ్యాయి. బీహార్‌కు చెందిన బిబూ ప్రసాద్ సాహూ(30) బంజారాహిల్స్ రోడ్డు నంబర్12లో నివసిస్తూ వంట మనిషిగా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 4.15 గంటల సమయంలో స్టార్ ఆస్పత్రికి నడుచుకుంటూ వెళ్తుండగా రోడ్డు నంబర్1లోని హనుమాను ఆలయ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అతడిని డబ్బులు అడిగాడు అనంతరం బలవంతంగా అతని వద్ద ఉన్న సెల్ ఫోన్‌ను లాక్కుని సమీపంలో గ్రీన్ కలర్ స్కూటీపై వేచివున్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దార్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో శ్రీనగర్ కాలనీ ఇందిరానగర్ బస్తీకి చెందిన అల్లనగిరి రాజు(27) తన గదిలో ఉంచిన ఐదు బంగారు ఉంగరాలు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్టోబర్ 28న అవి మాయమయినట్లు గుర్తించానని మొత్తం 35 గ్రాముల బరువున్న ఉంగరాల విలువ రూ.60వేలు ఉంటుందని తెలిపాడు. అప్పుడప్పుడు తన గదిలో ఉంటున్న ఎలక్ట్రీషియన్ పల్లె భరత్‌పై అనుమానం వ్యక్తం చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టు కాలనీలో మహిళను మోసం చేసిన కారు డ్రైవర్

జూబ్లీహిల్స్, నవంబర్ 4, ప్రభాతవార్త :
జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళను ఆమె వద్ద పనిచేసే డ్రైవర్ డబ్బుల విషయంలో మో సం చేశాడు. వివరాల్లోకి వెళ్తే గరుడుపల్లి శృతి గుప్తా తన డ్రైవర్ బనావత్ గణేష్‌కు పద్మారావునగర్‌లోని శివానంద ఆశ్రమ నిర్మాణ పనుల చెల్లింపుల నిమిత్తం అక్టోబర్ 26న రూ.3లక్షలు, అక్టోబర్ 28న మరో రూ.1.50 లక్షలు ఇచ్చారు. అయితే సదరు డ్రైవర్ ఆ డబ్బులను సంబంధిత వారికి చెల్లించకుండా ఆశ్రమం నుంచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తిరిగి వస్తానని భార్యకు చెప్పిన అతను ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని తెలిపారు. డబ్బులతోనే తిరిగి వస్తానని, లేదంటే రానని భార్యకు సందేశం పంపినట్లు పేర్కొన్నారు. గతంలో విడతల వారీగా రూ.2లక్షలు, రూ.40 వేలు, మరోసారి రూ.40వేలు తీసుకున్నట్లు ఫిర్యాదులో వెల్లడించారు. డ్రైవర్ భార్య, ముగ్గురు పిల్లలు తమ సర్వెంట్ క్వార్టర్స్‌లోనే ఉంటున్నారని, వారి పిల్లల చదువుల ఖర్చులు కూడా తామే భరిస్తున్నామని బాధితురాలు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

చేవెళ్ల మండల అభివృద్ధి అధికారి బన్సీలాల్

చేవెళ్ల, నవంబర్ 4,ప్రభాతవార్త : దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారు అన్ని రంగాల్లో రాణించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని చేవెళ్ల మండల అభివృద్ధి అధికారి బన్సీలాల్, మండల విద్యాధికారి పురన్ దాస్ అన్నారు. సమగ్ర శిక్ష తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో భవిత సెంటర్‌లో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులకు ఇతర విద్యార్థులతో సమానమైన హక్కులు ఉన్నాయని, వారిలోని ప్రతిభను గుర్తించి అన్ని రంగాల్లో రాణించేలా తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. ముఖ్యంగా క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారిలోని సామర్థ్యాలను గుర్తించి విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్లు భరత్, లలిత, అనిత, సువర్ణ మాల, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సమావేశమైన బిఆర్ఎస్ నాయకులు

పట్టబద్రుల ఓటరు నమోదును ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి: బిఆర్ఎస్

కేశంపేట నవంబరు 4 ప్రభాతవార్త : మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్క పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేలా పార్టీ నాయకులు కృషి చేయాలనీ కేశంపేట మండల పరిధిలోని నిడుదవెల్లి, కాకునూరు, తొమ్మిదిరేకుల,లింగందన, కొండారెడ్డిపల్లి, పోమాలపల్లి గ్రామాల్లో పర్యటించి సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామాల వారీగా పట్టభద్రుల వివరాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదులో పాల్గొనేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పట్టభద్రుల ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ హక్కు కల్పించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ గౌడ్, మాజీ పిఎస్సిఎస్ చైర్మన్ జగదీశ్వర్, మాజీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ కామ్లేకార్ నవీన్ కుమార్,మండల మాజీ కోఆప్షన్ సభ్యులు జమాల్ ఖాన్,లింగందన సర్పంచ్ నాగిళ్ళ వెంకట్, కొనాయపల్లి సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి రామకృష్ణ ముదిరాజ్, కాకునూర్ సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ వెంకటయ్య యాదవ్,మాజీ వైస్ ఎంపీపీ పల్లాటి సురేందర్,వెంకటేష్,ప్రేమ్ కుమార్ గౌడ్, జగన్మోహన్ రెడ్డి,నరేష్,రామ్ రెడ్డి, యాదయ్య,తిరుపతి రెడ్డి,సుదర్శన్ గుప్తా, మధుసూదన్ గౌడ్, దశరథ, ఉమాపతి,రంగయ్య, మల్లయ్య, సీమల శ్రీనివాస్, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డిని కరవు జిల్లాగా ప్రకటించాలి

- తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి - వేముల నర్వ, ఇప్పలపల్లి లోని రైతుల పంట పొలాలను పరిశీలించిన సిపిఐ ఎమ్మెల్సీ నెలికంటి సత్యం

పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, ఇతర నేతలు

కేశంపేట నవంబరు 4 ప్రభాతవార్త : తీవ్రమైన వర్షాభావ కరువు పరిస్థితుల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాలో రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి తీవ్ర అవస్థలో ఉన్న రంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ నెళికంటి సత్యం డిమాండ్ చేశాడు. బుధవారం రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శి పాలమాకుల జంగయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు ఒరుగంటి యాదయ్య, కేరామస్వామి ఎం యాదిరెడ్డి. బుద్ధుల జంగయ్య టి రామకృష్ణ జిల్లా కార్యవర్గ సభ్యులు సామెడి శేఖర్ రెడ్డి ఎం శ్రీను నాయక్ పల్నాటి యాదయ్య ఎం ప్రభు లింగం.పి శివకుమార్ ఎం పవన్ చౌహాన్ ఆర్ యాదగిరి వడ్ల సత్యనారాయణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి చంద్ర బాబు తదితర పార్టీ నాయకులతో కలిసి బుధవారం కేశంపేట మండలం ఇప్పలపల్లి వేముల నర్వ గ్రామాలను సందర్శించి ఎండిపోయిన పత్తి మరియు వడ్ల చేను మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన కరువు చాయలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ద్వారా రాష్ట్రాన్ని మొత్తం కరువు ప్రాంతంగా ప్రకటించే విధంగా ఒత్తిడి తేవాలని దీనికి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని సమన్వయంతో కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ఆయన సూచించారు రాబోయే ఆరు నెలలు చాలా తీవ్రమైన గడ్డు పరిస్థితులు ప్రజలు ఎదుర్కొనే పరిస్థితి ఉన్నందున ప్రభుత్వాలు సాగునీటి వసతి కరెంటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ ఆరు నెలలు ప్రతి తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదవాడికి 10 కిలోల బియ్యం పప్పు దినుసులు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశాడు ఎండిపోయిన మొక్కజొన్న పంటకు 15 వేల చొప్పున వరి పంటకు 30 వేల చొప్పున పత్తికి 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు రైతులు బ్యాంకులలో పంటలు వేసుకోవడానికి తీసుకున్న రుణాలను మొత్తాన్ని ఏకకాలంలో రద్దు చేయాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు పూర్తి చేసి ఈ జిల్లాకు సాగునీరు త్రాగునీరు అందించాల్సిన ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుతో దీనిని బొంద పెట్టారని ఆయన విమర్శించారు,

రంగారెడ్డి జిల్లాలో 27 మండలాలు కరువు పరిస్థితుల్లో ఉన్నందున మొత్తం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు చివరి తేదీ నవంబర్ 6

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

కేశంపేట నవంబరు4 ప్రభాతవార్త : కేశంపేట మండల పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూపట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియకు ఈనెల 6 వ తేదీ శుక్రవారం చివరి రోజు కావడం తో ఇంకా దరఖాస్తు చేసుకోని పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ముఖ్యంగా పట్టభద్రులు తమ సమస్యలను చట్ట సభల్లో వినిపించే నాయకులను ఎన్నుకోవడంలో భాగస్వాములు కావాలని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ ఓటు నమోదు చేసుకోకపోవడం వల్ల భవిష్యత్తులో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. కేశంపేట మండలంలోని ప్రతి గ్రామానికి చెందిన డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు వెంటనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలి.ఈ విషయాన్ని పట్టభద్రులు, యువత, విద్యావంతులు తమ స్నేహితులు మరియు కుటుంబ సభ్యులకు తెలియజే అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా సహకరించాలని కంచుకోట మహేష్ కోరారు.

కండక్టర్ ప్రవళికకు ఆర్టీసి కార్మికుల నివాళులు

మేడ్చల్ డిపోలో ప్రవళికకు నివాళులర్పిస్తున్న ఆర్టీసీ కార్మికులు

మేడ్చల్, నవంబర్ 4. ప్రభాతవార్త : విధి నిర్వహణలో ప్రయాణికురాలు తోసి వేయడంతో రన్నింగ్ బస్ నుండి కిందపడి చికిత్స పొందుతూ తుది శ్వాస విడిసిన కండక్టర్ ప్రవళికకు మేడ్చల్ డిపోలో నివాళులర్పించారు. మణుగూరు డిపోకు చెందిన ప్రవళిక విధి నిర్వహణలో అక్టోబర్ 25న చిల్లర విషయంలో ఏర్పడ్డ వివాదంలో ప్రయాణికురాలు బస్ నుండి కండక్టర్‌ను రన్నింగ్ బస్‌లో నుండి తోసివేయడంతో తీవ్ర గాయాల పాలై గత పది రోజులుగా చికిత్స పొందుతూ ఈ నెల 3న తది శ్వాస విడిచిన ఘటన అమానుషమని మేడ్చల్ బస్ డిపోలలో కార్మికులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో కార్మికులంతా గేట్ ధర్నా నిర్వహించి ఇటువంటి దాడులు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం, సంస్థ కలిసి రూ. 1 కోటి నష్టపరిహారం అందించి, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిపో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్లంపేట్ జగన్ గౌడ్, ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ శ్రీనివాస్, నాయకులు రాజయ్య, నరసింహ, డిఎం రెడ్డి, సునీత, సక్రి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండలంలో ఉద్యాన శాఖ, ఖేతి ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక శిక్షణా

కేశంపేట నవంబరు 4 ప్రభాతవార్త : కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో బుధవారం ఉద్యాన శాఖ మరియు ఖేతి ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని. హెచ్ఓ హిమబిందు, ఏపీఎం కవిత, హెచ్ఇఓ రాజేష్ మరియు ఖేతి అగ్రోనమిస్ట్ ఫైజాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు మరియు పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, పంటల ప్రణాళిక, సాగు పద్ధతులు మరియు పంటల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానాలు అందించి, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెరుగైన దిగుబడుల కోసం పాటించాల్సిన వ్యవసాయ సూచనలను వివరించారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని రైతులు ఉత్సాహంగా పాల్గొని తమ తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపు ఖాయం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు చేయిస్తున్న మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంతరెడ్డి

కీసర, నవంబరు4, ప్రభాతవార్త: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంతరెడ్డి అన్నారు. బుదవారం నాగారం డివిజన్ 5 పరిధిలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆ పార్టీ నాయకులకే నమ్మకం లేకుండా పోయిందని తెలిపారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకే మంచి వాతావరణం ఉందని, పార్టీ కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిపించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులు నవంబరు 6వ తేదీ లోపు అర్హులైన పట్టభద్రుల అందరితో ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఓటరు నమోదుకు ఓటర్ ఐడి, ఆధార్‌కార్డు, డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫోటో, మొబైల్ నంబరు అవసరమని తెలిపారు. అర్హులైన వారు వెంటనే నమోదు చేసుకోవడంతో పాటు ఇతర పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్‌గౌడ్, నాయకులు అన్నంరాజు సంజీవ, పులకుర్తి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడడం

ప్రతి ఒక్కరి బాధ్యత

అయ్యప్ప స్వామి దేవాలయంలో మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నందిగామ, నవంబరు 4, ప్రభాతవార్త : ఎలినినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక భూగర్భ జలం అడుగంటి తాగునీటికి సాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయని, రానున్న విపత్కర పరిస్థితిలను దృష్టిలో ఉంచుకొని నీటిని ప్రతి ఒక్కరు పొదుపుగా వాడాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు.నందిగామ మండ్నల అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో హెచ్ బి ఎల్ ఆర్థిక సాయంతో మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి గిరీష్ నాయర్ ,మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్ ,నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, బుగ్గోని గూడ సర్పంచ్ సాలయ్య, నందిగామ ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, మాజీ అధ్యక్షుడు జంగా నర సింహులు, సింగిల్ విండో చైర్మన్ చంద్ర పాల్ రెడ్డి, సిడి తాండ మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్, ఏఎంసీ డైరెక్టర్ నర్సిం లు, నాయకులు గుండాల వేణుగోపాల్, నవపేట్ రవీందర్ గౌడ్, చించేటి కృష్ణగౌడ్, బి సుదర్శన్ గౌడ్, బుర్రి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పేదోడికి సొంతింటికల సాకారమే లక్ష్యం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నాయకులు

జిల్లెడు చౌదరిగూడ, నవంబరు 04,ప్రభాతవార్త: గ్రామాల్లోపి పేద ప్రజల సోంతింటికళను సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండలం లోని కాస్లాబాద్, పీర్జాపూర్ గ్రామమాలలో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బృహత్తర పథకాన్ని షాద్‌నగర్ నియోజకవర్గంలో పక్కాగా అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా రాత్రింబవళ్లు శ్రమిస్తున్న షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఎలాంటి పక్షపాతం లేకుండా, కేవలం అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని అన్నారు. పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదములు అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ,మాజీ మండల అధ్యక్షులు చలివేంద్రంపల్లి రాజు, సర్పంచ్‌లు కుమార్, నీలయ్య, మాజీ ఎంపీటీసీ సత్యం రెడ్డితో పాటు గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లేష్, రాజేష్, పాపయ్య, నరసింహులు, రామాంజన్, కృష్ణ, మొగిలిరెడ్డి, కిషన్, రమేష్ పాల్గొన్నారు.

కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

షాద్‌నగర్, నవంబరు 4, ప్రభాతవార్త : షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్‌సీఎన్ హోమ్‌లో నివసిస్తున్న కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు పలువురు దాతలు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఇందులో భాగంగా ఎంబీసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ తన బృందంతో కలిసి బాధితులకు సబ్బులు, సర్ఫ్‌తో పాటు ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

ఎఫ్‌సీఎన్ హోమ్ నిర్వాహకులు చిత్తా థామస్ రెడ్డి, డాక్టర్ గీత ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు.

సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం


నాగారంలో కళ్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర, నవంబరు4, ప్రభాతవార్త: సీఎం సహయనిధి నిరుపేదలకు వరంలాంటిదని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుదవారం నాగారం డివిజన్ పరిధిలోని ఎస్‌వినగర్ కాలనీకి చెందిన గన్నోగోని అనురాధగౌడ్‌కి కళ్యాణలక్ష్మీ 1 లక్ష 116 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజంగా అర్హులైన పేదలకు చేరాలన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు.తమ సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మెరుగు శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రజలకు సురక్షిత తాగునీరు

రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సిహెచ్. సత్యనారాయణ రెడ్డి

చేవెళ్ల, నవంబర్ 4: పల్లె ప్రాంత పేద ప్రజలకు సురక్షితమైన త్రాగు నీటిని అందించేందుకు గాను సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సత్యం ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి వెల్లడించారు. చేవెళ్ల మండలం ఈర్లపల్లి గ్రామంలో సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య సర్పంచ్ లావణ్య రాజశేఖర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన తాగునీరు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామస్థులకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ తరఫున ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. సేవాభావంతో ముందుకొచ్చి గ్రామస్థులకు తాగునీటి సదుపాయం కల్పించిన సత్యం ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ సమతావెంకట్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాముగౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్, సర్పంచులు గోటూరి రాంచంద్రయ్య, మాజీ సర్పంచ్ ప్రభాకర్, నాయకులు కుమార్, మైనారిటీ నాయకులు ఖదీర్, లియాఖత్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో నిర్మాణంలో అభివృద్ధి భవనాలు

7 న మంత్రుల రాక - ప్రారంభోత్సవ కార్యాలయాలను పరిశీలించిన ఎమ్మెల్యే

నందిగామ, నవంబరు 4, ప్రభాతవార్త : నందిగామ మండల కేంద్రంలో ఎస్డిఎఫ్ నిధులు సుమారు రూ.1 కోటికి పైగా లక్షలతో నిర్మించిన మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణాన్ని బుధవారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఏడవ తేదీన ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , పలువురు రాజకీయ ప్రముఖులు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నందిగామలో నిర్మితమైన మండల ప్రజా పరిషత్ కార్యాలయం భవనం, హై స్కూల్ భవనం, అంగన్వాడి భవనం (1), మహిళా సమాఖ్య భవనం(డ్వాక్ర) భవనాలను, మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని, నందిగామ చౌరస్తా వద్ద హైమాక్స్‌లైట్లను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్, సర్పంచ్ కొమ్ము కృష్ణ,

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చంద్రపాల్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, అడ్వకేట్ అంజియాదవ్, సిడి తండ మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్,

నాయకులు బుర్రి నరేందర్ రెడ్డి, ఎర్రగారి రమేష్, చిందం నరసింహులు, తడకల జంగయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి మౌలిక వసతుల

కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల, నవంబర్ 4,ప్రభాతవార్త: గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఈర్లపల్లి, గొల్లగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈర్లపల్లి గ్రామంలో రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ ప్రహరీ గోడను, రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన వీధి దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా గొల్లగూడెం గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ సమతావెంకట్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాముగౌడ్, సర్పంచులు లావణ్య రాజశేఖర్, చెవుల నిర్మల నర్సింహులు, గోటూరి రాంచంద్రయ్య, శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, నాయకులు కుమార్, మైనారిటీ నాయకులు ఖదీర్, లియాఖత్ తదితరులు పాల్గొన్నారు.

మా విఠ్యాల.. మట్టి కొట్టుకుపోవాలా?

గుట్టలను కొల్లగొడుతూ గ్రామాన్ని పాతరేస్తున్నారు

స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం గ్రామస్తుల హెచ్చరిక

విట్యాల గ్రామస్తులు

షాద్‌నగర్, నవంబరు 4, ప్రభాతవార్త : ఒకవైపు మైనింగ్ తవ్వకాలు.. మరోవైపు మట్టి తరలింపులు.. నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాల రాకపోకలు.. ఫలితంగా పచ్చదనం కనుమరుగవుతుండగా, పర్యావరణం దెబ్బతింటోందని, భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కళ్ల ముందే గుట్టలు కనుమరుగవుతుంటే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాల గ్రామ శివారులో కొనసాగుతున్న మట్టి తరలింపు వ్యవహారం గ్రామంలో తీవ్ర వివాదానికి దారితీసింది. మైనింగ్ అనుమతుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ నాగయ్యను కలిసేందుకు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తమ ఆవేదనను మీడియా ముందు వెళ్లగక్కారు.గ్రామ నాయకుడు నెహ్రూ మాట్లాడుతూ గత ఐదు, ఆరు నెలలుగా గ్రామ శివారులోని గుట్ట నుంచి పెద్ద ఎత్తున మట్టి తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లాలని, రెవెన్యూ కార్యాలయంలో అడిగితే మైనింగ్ శాఖను సంప్రదించాలని చెబుతూ అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టుకుంటున్నారని మండిపడ్డారు. మైనింగ్ అనుమతులు, రాయల్టీ చెల్లింపుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తే గ్రామ భవిష్యత్తు ఏమవుతుందని ప్రశ్నించారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో లారీలు మట్టిని తరలిస్తున్నాయని, దీనివల్ల గ్రామంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరైనా ఇల్లు నిర్మించుకునేందుకు నాలుగు గంటల మట్టి తీసుకెళ్లినా అనుమతుల పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేసారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు ఎంపిక

& JUNIOR COLLEGE
Mujahidpur (V), Kulkacherla(Mdl), Vikarabad (Dist)

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల, నవంబరు 4, ప్రభాతవార్త:

విద్యార్థులు చదువుతో పాటుక్రీడాల్లో రాణించాలని ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి హాప్సిబా, పిఇటి ఉపాధ్యాయుడు కృష్ణరెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని సెయింట్ జూడ్స్ పాఠశాలలోని 30 జట్లతో జరిగిన పిఎంశ్రీ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థి అరుణ్‌కుమార్ కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపికవడంతో పాటు 100మీటర్ల పరుగు పందెంలో జిల్లా మొదటిస్థానం దక్కించుకున్నాడు. వాలీబాల్‌లోను బాలికలు ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోవడంతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి హాప్సిబా ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

-ఎంపిడిఓ పాండు

Public Grievance Redress Monitoring System
ప్రతి సోమవారం
ఉదయం 10:00గంటల నుండి మధ్యాహ్నం 1:00గం. వరకు
MPP
P 55
P 56

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ పాండు తదితరులు

పూడూరు, నవంబరు 4, ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి పాండు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎల్‌నినోతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవగాహనకోసం ముందు జాగ్రత్తగా బుధవారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచులు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భజలాలు అంతరించిపోకుండా గ్రామాల్లో విబిజిరాంజి గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఇంకుడుగుంతలు, వాలు కట్టలు వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. పశువులకు తాగునీటిసమస్య రాకుండా తొట్టిలను ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఒ సుందర్, పంచాయతీరాజ్ ఎఇ మధుసూధన్, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నీరు వృథాచేస్తే రూ.5వేలు జరిమానా

-ఎంపిడిఒ రామకృష్ణనాయక్ హెచ్చరిక

ఎల్‌నినో ప్రభావంపై మాట్లాడుతున్న ఎంపిడిఒ రామకృష్ణనాయక్

కుల్కచర్ల, నవంబరు 4, ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో తెలెత్తే నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శిలు ముందస్తుచర్యలు చేపట్టాలని ఎంపిడిఒ రామకృష్ణనాయక్ సూచించారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయలో పిఎస్‌సిఎస్ చైర్మన్ భీంరెడ్డితో కలిసి సర్పంచ్‌లతో, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎంపిడిఒ రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటిని ఎవరూ వృథా చేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని, నీటిని వృథాచేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులకు రూ.5వేల జరిమానా విధించాలని స్పష్టంచేశారు. నీటి కొరత తలెత్తకుండా ఇప్పటినుంచే తగినచర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో నీటి వినియోగం చెక్‌డ్యాములు, నీటికుంటలపై ప్రత్యేకదృష్టి సారించాలని, ఆదేశించారు. రైతుల పశువులకు పశుగ్రాసం కోసం అవగాహన కల్పించాలని సూచించారు.

పై అధికారుల ఆదేశాలు బేఖాతర్...!

ఎల్‌నినో ప్రభావంతో రానున్నరోజుల్లో తలెత్తే నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమవుతున్న వేళ క్షేత్రస్థాయిలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో తాగునీటి వృథాను అరికట్టడం, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడం వంటి అంశాలపై చర్చించేందుకు ఎంపిడిఒ రామకృష్ణనాయక్ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆదేశాలు జారీచేశారు. అయితే ఈసమావేశానికి కొందరుసర్పంచ్‌లు హాజరు కాకపోవడంతోపాటు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, పలు అధికారులు సైతం గైర్హాజరుకావడం చర్చనీయంశంగా మారింది. ప్రజలకు అత్యవసరమైన తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని ఆదేశాలు ఇస్తున్నప్పటికీ, వాటిని అమలుచేయాల్సిన వారు సమావేశాలకు హాజరుకాకపోవడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. పై అధికారుల ఆదేశాలకు విలువ లేదా ? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వేసవికిముందే నీటిసమస్యను గుర్తించి పరిష్కారచర్యలు చేపట్టాల్సిన బాధ్యత గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులపై ఉంది. ఇలాంటి కీలక సమయంలో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో గ్రామీణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించి ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే

-లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, మున్సిపల్‌చైర్మన్

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

షాద్‌నగర్, నవంబరు 4, ప్రభతవార్త:

షాద్‌నగర్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న నూతనగృహాల గృహప్రవేశ వేడుకలు ఆనందోత్సాహాలమధ్య జరిగాయి. కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనగృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారుల కుటుంబాలను కలిసి అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబసభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆనందంలో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్‌ముదిరాజ్, కౌన్సిలర్ దిలీప్, మాజీ కౌన్సిలర్ రాజేందర్‌రెడ్డి, ముబారక్ అలీఖాన్, చందులాల్, మాధవులు యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజుగౌడ్, గడ్డమీది రమేష్, శేఖర్‌గౌడ్, సందీప్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కాశీం, విజయ్‌రెడ్డి, జానీ, రవి, శ్రీకాంత్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలను పరిశీలించిన సిపిఐ నేతలు

వరిపంటలను పరిశీలించిన రాష్ట్ర, జిల్లా, మండల సిపిఐ నాయకుల బృందం దృశ్యం

శామీర్‌పేట, నవంబరు 4, ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో క్షేత్రస్థాయిలో వరి పంటపొలాలను రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి సిపిఐ నాయకుల బృందం పర్యటించి పరిశీలించింది. శామీర్‌పేట గ్రామంలోని వ్యవసాయ పొలాలను, వరిపంటలను శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిపిఐ నాయకుల బృందం పర్యటించి పంటలు వేసిన రైతులతో, కౌలురైతులతో మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్.బోస్, జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్, రాష్ట్ర పార్టీ కంట్రోల్ కమిషన్ మెంబర్ డిజి సాయిలుగౌడ్, పలువురు సిపిఐ నాయకులు పాల్గొని వరిపంట వల్ల కలిగిన పెట్టుబడి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. మహిళా కౌలురైతులు మేకల బాలమణి, నర్ల బాలమణి, శ్రీరాముల శ్రీశైలం, పెంజర్ల దానయ్య రైతులు 11ఎకరాల్లో బిపిటి, చింటూ, కావేరి సూపర్ అమ్మోనియా రకాల వరిపంటలను పండించటం జరుగుతుందన్నారు. అయితే వరిపంటకు సరిపోను నీరు అందక వర్షాలు లేని కారణంగా పంటలు ఎండి దిగుబడి తగ్గే అవకాశం ఉందని ఆందోళనను వ్యక్తంచేశారని వారు తెలిపారు. రాష్ట్ర సిపిఐ కార్యదర్శివర్గ సభ్యులు విఎస్.బోస్, జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శామీర్‌పేటమండలాన్ని కరువుప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్‌చేశారు. కొన్ని మండలాలను ప్రకటించి శామీర్‌పేట మండలాన్ని కరువుగా ప్రకటించలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నట్లు వారు తెలిపారు. నీరు అందని ఎండిపోయిన పొలాలను సందర్శించటం జరిగిందన్నారు. రైతులు పంటలు నష్టపోయినవారికి ఎకరానికి 30 వేల రూపాయలు నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రైతులను ఆదుకోవాలని, తెలంగాణ రాష్ట్రాన్ని కరువురాష్ట్రంగా ప్రకటించి జాతీయ విపత్తుగా పరిగణించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. రైతుల పరిస్థితిని, పంటల పరిస్థితిని సిపిఐనాయకులు సేకరించి మండల వ్యవసాయ అధికారి రమేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ అటామిక్ రైన్‌ఫాల్ 30శాతం కన్నా తక్కువ ఉంటే డ్రాప్ అవుట్‌గా సాంకేతికత ఆధారంగా పరిగణిస్తామన్నారు. వివరాల ప్రకారం మండలంలో వరి 2800 ఎకరాలు, జొన్న 100ఎకరాలు, ఉద్యానవనపంటలు, కూరగాయలు 580ఎకరాలు, పండ్లతోటలు 1200ఎకరాలు, పత్తి 20ఎకరాలలో శామీర్‌పేట మండలంలో రైతులు పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. సిపిఐ నాయకులు అందజేసిన వినతి పత్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారికి నివేదికను అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి రమేశ్ వివరించారు. అనంతరం శామీర్‌పేట వ్యవసాయ సేవాసహకారసంఘం సిఇఒ డి.రవీందర్‌కు, వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్‌కు సిపిఐ నాయకులు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వారితోపాటు తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి నిమ్మల నర్సింహ్మా, మహిళా సమాఖ్య నాయకురాలు జె.లక్ష్మి, బిసిహక్కుల సాధనసమితి అధ్యక్షకార్యదర్శులు బాపు రాజు, కె.కృష్ణ, సిపిఐనాయకులు వై.వెంకటేశ, బి.రాజిరెడ్డి, డి.భూమయ్య, సోగడ రమేష్, నరేంద్రచారి, స్వామి, చిరంజీవి, పలువురునాయకులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలలో పాములతో భయం..భయం

-7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేశ ఆందోళన

పాఠశాల పరిసరాల్లో పాము సంచరించిన దృశ్యం

శామీర్‌పేట, నవంబరు 4, ప్రభాతవార్త:

అలియాబాద్ (మున్సిపల్ కేంద్రంలోని) గ్రామంలోపలగల ప్రాథమిక పాఠశాల పక్కన పిచ్చిమొక్కలు, గడ్డి,పొదలతో నిండి ఉండటంతో విద్యార్థులకు ప్రమాదకరంగా మారిందని, ఈ విషయంపై కమిషనర్‌కు, చైర్‌పర్సన్‌కు పలు సార్లు తెలిపినా పట్టించుకోవటం లేదని అలియాబాద్ మున్సిపల్ ఏడవ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేశ్ ఆందోళన వ్యక్తంచేశారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలోని, ఆ గ్రామంలోపలగల ప్రాథమిక పాఠశాల పరిసరాలు విద్యార్థులకు ప్రమాదాలు పొంచి ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌కు, చైర్‌పర్సన్‌కు తెలిపినప్పటికీ స్పందించటం లేదని దీంతో విద్యార్థులకు ప్రమాదాలు జరగవచ్చుని భావిస్తూ కౌన్సిలర్ గాదె వెంకటేశ్ స్వంతఖర్చులతో పరిసరాలు శుభ్రంచేయించటం జరిగిందని వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు భయపడుతున్నందున, పరిసరాలు పొదలు, గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిపోవటంతో పాఠశాల లోపలికి పాములు కూడా ఇటీవల రావటం జరిగిందని అన్నారు. గత మూడునెలల నుంచి సమావేశాలు కౌన్సిల్ దృష్టికి తెచ్చినా స్పందన లేదని దీంతో తానే స్వంత ఖర్చుతో పాఠశాల పరిసరాలు పొదలు లేకుండా చేయించినట్లు ఆయన తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిస్థితిని తెలుసుకుని శాశ్వత పరిష్కారం చేయాలని, విద్యార్థులకు, టీచర్లకు భరోసా కల్పించాలని కౌన్సిలర్ గాదె వెంకటేశ్ స్పష్టంచేశారు.

ఎమ్మెల్యే శంకర్‌ను కలిసిన ట్రాఫిక్ సిఐ ఉపేందర్

ఎమ్మెల్యేను కలిసిన ట్రాఫిక్ సిఐ ఉపేందర్

షాద్‌నగర్, నవంబరు 4, ప్రభాతవార్త:

కొత్తూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన సిహెచ్ ఉపేందర్ బుధవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ నూతన సిఐకి శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రాఫిక్ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

వాహనాల వేలానికి ఫ్యూచర్ సిటీ పోలీసుల చర్యలు

వేలం వాహనాలను చూపిస్తున్న పోలీసులు

రంగారెడ్డి జిల్లా అర్బన్, నవంబరు 4, ప్రభాతవార్త:

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హక్కుదారులు గుర్తించని 244 వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ వాహనాలు మొయినాబాద్ పోలీస్ స్టేషన్ గ్రౌండ్స్‌లో ఉన్నాయి. వాహనాల అసలు యజమానులు, చట్టబద్ధమైన హక్కుదారులు తమ యాజమాన్యాన్ని నిరూపించుకునేందుకు నోటీసు ప్రచురించిన తేదీ నుంచి ఆరు నెలల గడువు ఇచ్చారు. ఈలోగా సరైన పత్రాలతో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. గడువులోగా ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనాల పూర్తి వివరాలను ఫ్యూచర్ సిటీ పోలీస్ వెబ్‌సైట్లో పొందవచ్చు. వివరాలకు ఎంటి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సుబ్రహ్మణ్యం (8712670664)ను సంప్రతించాలని పోలీసులు సూచించారు.

రైల్వే అండర్‌పాస్‌తో ప్రజలకు ఎంతో మేలు: సర్పంచ్

అండర్‌పాస్ రైల్వే బ్రిడ్జి ప్రారంభిస్తున్న సర్పంచ్, ఇతర నేతలు

శంషాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:

రైల్వే అండర్‌పాస్‌తో జూకల్ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సర్పంచ్ ఐలమ్మ పేర్కొన్నారు. బుధవారం శంషాబాద్ మండలం షాపూర్ నుంచి జూకల్ వెళ్లే మార్గంలో నిర్మించిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిని జూకల్ సర్పంచ్ రాళ్లబండి ఐలమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పెద్దలు మదన్ మోహన్‌రెడ్డి సహకారం, ప్రోత్సాహంతో నిర్మించిన ఈ బ్రిడ్జి వల్ల జూకల్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. గతంలో రైలువెళ్లే సమయంలో వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారని, సమయం వృథా అయ్యేదని తెలిపారు. అండర్‌పాస్ అందుబాటులోకి రావడంతో రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వ్రతాల నిర్వహణపై అర్చకుల ప్రకటన

షాద్‌నగర్, నవంబరు 4, ప్రభతవార్త:

దీపావళిపండుగ, కేదారేశ్వరవ్రతాల నిర్వహణకు సంబంధించి భక్తులకు షాద్‌నగర్ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు, ప్రముఖ అర్చక పురోహితులు రవిశర్మ ముఖ్యసూచనలు చేశారు. ఈ నెల 8వ తేదీన దీపావళిపండుగ సందర్భంగా ఉదయం 4గంటల నుంచి మంగళహారతులు ప్రారంభమవుతాయని, అదేరోజు సాయంత్రం ధనలక్ష్మిపూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అమావాస్యసాయంత్రం నోములునోచుకునే భక్తులు కేదారేశ్వరవ్రతాన్ని ఆచరించవచ్చని సూచించారు. అలాగే నవంబరు 9వ తేదీనకూడా వ్రతాలు నిర్వహించుకోవచ్చని వెల్లడించారు. ఈ సంవత్సరం విశాఖకార్తి, స్వాతినక్షత్రం లేని కారణంగా కొత్తనోములు నోచుకోవడానికి అనుకూలతలేదని రవిశర్మ స్పష్టంచేశారు. భక్తులు గమనించి పూజాకార్యక్రమాలను నిర్వహించుకోవాలని కోరారు.

షాద్‌నగర్‌కు డికె అరుణ చేసింది ఏమిటి..?

-మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహమ్మద్ అలీఖాన్ బాబర్ నిలదీత
-ఎంపి లేఖలు ఎక్కడ ?.. ప్రొసీడింగ్స్ చూపగలరా ?
-ఫొటోల రాజకీయం తప్ప షాద్‌నగర్‌కు ఎంపి అరుణ సాధించింది శూన్యం
-మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్

షాద్‌నగర్, నవంబరు 4, ప్రభాతవార్త:

షాద్‌నగర్ పట్టణంలో ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జినిర్మాణ ఘనత తమదేనంటూ బిజెపి నాయకులు ఎంపి డికె అరుణకు కృతజ్ఞతలు చెప్పడం కేవలం ప్రచారార్భాటమేనని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ మహమ్మద్ అలీఖాన్ బాబర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అసలు ఈ ప్రాజెక్టు కోసం ఎంపిగా డికె అరుణ అధికారికంగా చేసినకృషి ఏంటో, ఎవరికి ప్రతిపాదనలు పంపారో, ఏ తేదీల్లో లేఖలురాశారో ప్రజలముందు ఆధారాలతో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. స్థానిక సీనియర్ కాంగ్రెస్‌నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాబర్ మాట్లాడుతూ.. షాద్‌నగర్ రైల్వేబ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తిగా అధికారిక యంత్రాంగం ద్వారా చట్టబద్ధంగా జరుగుతోందని స్పష్టంచేశారు. భూసేకరణ కోసం ఆర్డీవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు అధికారిక లేఖలు వెళ్లాయని, ఆపై కలెక్టర్ ద్వారా ఐఅండ్‌పిఆర్ కమిషనర్‌కు సమాచారం అందిందని తేదీలతో సహా సంబంధిత ప్రొసీడింగ్స్ పత్రాలను ఆయన మీడియాకు చూపించారు. ఈ క్రమంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం జరిగేలా, వారికి ఎంత పరిహారం (కాంపెన్సేషన్) అందించాలన్న విషయమై ఆర్డీవో కార్యాలయం ఆధ్వర్యంలో బాధితులతో ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహించారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనుల్లో జాప్యంజరిగే అవకాశం ఉండటంతో, ప్రాజెక్టు ప్రాముఖ్యత దృష్ట్యా రైల్వే విభాగమే స్వయంగా 100 శాతం నిధులతో ఈ నిర్మాణాన్ని పూర్తిచేయాలని నిర్ణయించిందని బాబర్ వెల్లడించారు. స్థానిక ఎంపిగా ఉన్న డికె అరుణ మాత్రం ఢిల్లీకి వెళ్లి పార్టీపెద్దలను, కేంద్రమంత్రులను కలిసి మర్యాదపూర్వకంగా శాలువాలు కప్పడం, ఫొటోలు దిగడం తప్ప నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఆమె చేసిందేమీలేదని మండిపడ్డారు. ప్రచారపిచ్చితో సంబంధంలేని పనులకు క్రెడిట్ కొట్టేయాలని చూడటం బిజెపి నాయకులకే చెల్లిందని ఎద్దేవాచేశారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చంది తిరుపతిరెడ్డి, మహబూబ్, రమేష్, చంద్రశేఖర్ గౌడ్, చందం నరసింహులు, జంగయ్యలతో పాటు డిప్యూటీసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంధ సంస్థలసేవలు అభినందనీయం

-కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి

వైద్యపరీక్షలు పొందుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, నవంబరు 4, ప్రభాతవార్త:

సమాజ శ్రేయస్సు, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు పేదలకు వరమని, అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దశాబ్దాల పాటు నిర్విరామంగా సమాజ సేవలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ చరిత్రలో నిలిచిపోతుందని ఆయన కొనియాడారు. దివంగత లయన్స్‌క్లబ్ గవర్నర్ రూప్‌కరణ్‌రెడ్డి లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో బుధవారం ఆమనగల్లు మున్సిపాలిటీ సిబ్బందికి యశోద ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించింది. మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి చైర్మన్ పత్యనాయక్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో మున్సిపాలిటీ సిబ్బందితో పాటు పట్టణంలోని పేద ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 200మందికి పైగా శిబిరానికి హాజరై వైద్య సేవలు పొందారు. వైద్యులు మధుమేహం, నేత్రపరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన వైద్య సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైనచికిత్స పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాటి సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎర్రవోలు మహేశ్, అనుముల రమేశ్, కో-ఆప్షన్ మెంబర్లు చుక్కా అల్లాజీగౌడ్, కండె సీతారాములమ్మ, ఖాదర్, అలీమబేగం, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి, మేనేజర్ ఆంజనేయులు, లయన్స్‌క్లబ్ సభ్యులు మెండెం చంద్రశేఖర్, నటరాజ్ యాదయ్యగుప్త, కె.రాంరెడ్డి, జూలూరి రమేశ్, పిఆర్ఒ పాష, యశోధ ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

మణుగూరు మహిళా కండక్టర్‌కు నివాళి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబరు 4, ప్రభాతవార్త:

ఖమ్మంజిల్లా, మణుగూరులో చిల్లర డబ్బుల కోసం ఓ ప్రయాణికురాలు, మహిళాకండక్టర్ ప్రవళికను తోసేసిన ఘటనలో చికిత్సపొందుతూ ప్రవళిక మృతిచెందడంతో తాండూరుడిపో ఆధ్వర్యంలో ప్రవళికకు ఘననివాళి అర్పించారు. టిజిఎస్ ఇన్చార్జ్, డిపో గౌరవ అధ్యక్షులు సాంబూర్ సోమశేఖర్ మాట్లాడుతూ.. గత నెల 26న మణుగూరు డిపోకు చెందిన మహిళాకండక్టర్ ప్రవళికను చిల్లరడబ్బుల కోసం ఒక ప్రయాణికురాలు బస్సు నుండి తోయగా, బస్సు చక్రాలకింద పడి రెండుకాళ్ళు విరిగిపోయి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కండక్టర్ మరణించడం చాలా బాధాకరమని, కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. మరణానికి కారణమైన ప్రయాణికురాలిపై చర్యలుతీసుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం తరపున ప్రవళిక కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఆర్టీసి కార్మికులపై భవిష్యత్తులో ఇలాంటిఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుని, కార్మికులకు భద్రత కలిగించాలని కోరుతూ వికారాబాద్ జిల్లా, తాండూర్‌డిపో నుండి అంబేద్కర్‌విగ్రహం వరకు ఆర్టిసి కార్మికులు ర్యాలీచేపట్టారు. నిరసనలో డిపో కార్యదర్శి నవీన్‌గౌడ్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ బాలప్ప, డిపో అధ్యక్షులు బస్వరాజ్, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని నిరసన వ్యక్తంచేసారు.

బిజెపి సీనియర్ నాయకుడి ప్రథమవర్ధంతిలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు

కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు

మేడ్చల్, నవంబరు 4, ప్రభాతవార్త:

మేడ్చల్ పట్టణానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు డివి.కిషన్‌రావు ప్రథమవర్ధంతి కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. కిషన్‌రావు పార్టీకి ఎనలేని సేవలుచేశారని, పార్టీకి ఆయనలేని లోటు తీర్చలేనిదని ఈసందర్భంగా అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్, మున్సిపల్ ప్రధానకార్యదర్శులు వంశీ, విజయ్, ప్రేందాస్, నాయకులు సుధాకర్‌రెడ్డి, సర్వేశ్వరరెడ్డి, లక్ష్మారెడ్డి, సాయినాథ్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మైసరి రాజు, సత్యనారాయణరెడ్డి, పికెట్ నర్సింగ్ రావు, శ్రీనాథ్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 6న ధర్నా జయప్రదం చేయాలి

-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ పిలుపు

కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

షాద్‌నగర్, నవంబరు 4, ప్రభాతవార్త:

పట్టణప్రాంత పేదలకుసైతం ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలని, సంవత్సరానికి 200రోజుల పని కల్పించి రోజుకు రూ.800కూలీ చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు, షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీనునాయక్ డిమాండ్‌చేశారు. బుధవారం ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఆయన సందర్శించి కూలీలసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణాల విస్తరణ పేరుతో అనేక గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనంచేయడంతో ఆయాగ్రామాల్లో గ్రామీణ ఉపాధిహామీ పనులు రద్దయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో గ్రామీణపేదలకు ఉపాధిలేక ఇతర ప్రాంతాలకు వలసవెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విలీన గ్రామాలతో పాటు పట్టణ ప్రాంత పేదలందరికీ ఉపాధిహామీ పనులు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని కల్పించి రోజుకు రూ.800 వేతనం చెల్లించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నవంబరు 6న హైదరాబాద్‌లోని సిఆర్‌డి కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో ఉపాధికూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనునాయక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘంనాయకులు మహేష్, అంజయ్య, అంతయ్య, మన్నెమ్మ, కమలమ్మ, రాములమ్మ, అనిత, లక్ష్మమ్మ, కృష్ణవేణి, మంజుల, కల్పన, భాగ్యమ్మ, లలిత, గీత, అరుణ, యాదమ్మ, మంగమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.